## క్లుప్తంగా

### 30న వార్షికోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు రెడ్డి సేవా సమితి 21వ వార్షికోత్సవాన్ని ఈనెల 30న జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తూము ఇంద్రసేనా రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ సేవా సమితి ఆధ్వర్యంలో బాలుర, బాలికల వసతి గృహాలు ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు వసతి కల్పించినట్లు తెలిపారు. 20ఏళ్ల నుంచి వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ విద్య, వైద్య, ఉపాధి అవసరాలకు చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. వార్షికోత్సవ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సేవా సమితి సభ్యులు, రెడ్డి బంధువులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో సమితి ప్రధాన కార్యదర్శి రాఘవారెడ్డి, కోశాధికారి రాజేందర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి ఎస్.సురేందర్‌రెడ్డి, సభ్యులు కోటేశ్వర్‌రెడ్డి, తూము పరమేశ్వర్‌రెడ్డి, సత్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మూఢనమ్మకాలు వీడాలి

మహమ్మదాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు మూఢ నమ్మకాలను నమ్మి నష్టపోవద్దని పోలీసు కళాకారుల బృందం తెలిపారు. శుక్రవారం గాధిర్యాల్‌లో మూఢ నమ్మకాలు, బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సైదయ్య మాట్లాడుతూ గ్రామాల్లో మూఢ నమ్మకాలతో ఎంతో మంది నష్టపోతున్నారని తెలిపారు. దీంతో పాటు బాల్యవివాహాలు చేసి బాలికల జీవితాలను బలి చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### సీఎం సమాధానం చెప్పాలి

దేవరకద్ర రూరల్: అందరికీ ఒకే న్యాయం కల్పిస్తామని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్ తమ మంత్రులకు, ఎమ్మెల్యేలకు ఒక న్యాయం, ప్రజలకు మరొక న్యాయం చేస్తున్నారని పీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్ గౌడ్ విమర్శించారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం కేసీఆర్ చేపట్టిన ప్లీనరీ సమావేశంలో మంత్రి నిరంజన్ రెడ్డి భూముల ఆక్రమాలపై ప్రతిపక్ష నాయకులు నిలదీస్తే అలాంటి వాటికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని చెప్పడం సరికాదని, దళితబంధు పంపిణీలో జరిగిన కమీషన్లపై స్పందించాలన్నారు.

### మేడే ఘనంగా నిర్వహించాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మేడే వారోత్సవాలను కార్మిక లోకమంతా ఘనంగా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్మిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం రోజుల పాటు నిర్వహించే మేడే ఉత్సవాల్లో భాగంగా రోజుకో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, వక్తృత్వ, ఉపన్యాస పోటీలను నిర్వహించాలన్నారు.

### అభివృద్ధి పనుల పరిశీలన



నవాబుపేట: మండలంలోని లింగంపల్లిలో రూ.కోటికి పైగా నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ నరేందర్‌రెడ్డి స్థానిక జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డితో కలిసి గ్రామంలో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనం, పాఠశాల అదనపు గదులు, హెల్త్ సబ్ సెంటర్లను పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. నాణ్యత పాటించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, ఉపసర్పంచ్ పద్మారెడ్డి, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

### నిర్లక్ష్య వైఖరి వీడాలి



జడ్చర్ల: ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఆందోళనలను కొనసాగిస్తామని, ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట వీఓఏలు చేపట్టిన సమ్మె శుక్రవారం 12వ రోజుకు చేరుకుంది. సమస్యల పరిష్కారానికి చొరవ చూపని ప్రభుత్వ తీరును నిరసిస్తూ పట్టణంలో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. వీఓఏలకు వేతనాలను పెంచాలని, సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఓఏలు తిరుపతమ్మ, రమాదేవి, వసియాబేగం, సరిత, స్వరూప, కల్పన, సుజాత, చంద్రకళ పాల్గొన్నారు.

### నలుగురికి గాయాలు

జడ్చర్ల: మండలంలోని మాచారం బ్రిడ్జి వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం రెండు బైక్‌లను హైదరాబాద్ వైపు నుంచి జడ్చర్ల వైపునకు వస్తున్న కారు వేగంగా ఢీకొట్టడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ రమేశ్‌బాబు కథనం మేరకు.. మాచారానికి చెందిన శివకుమార్, సంతోష్‌లు బైక్‌పై జడ్చర్ల వైపునకు వస్తుండగా, వెనుక నుంచి కారు వేగంగా ఢీకొట్టింది. వీరి వెనకే వస్తున్న మరో బైక్‌ను కూడా కారు ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న ఆదిల్, నవీన్‌లు గాయపడ్డారు. వీరిని వైద్య చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# వ్యర్థాలతో దుర్గంధం

- హోటళ్లు, టిఫిన్ సెంటర్ల ద్వారా వెలువడుతున్న వైనం
- పట్టించుకోని నిర్వాహకులు, మున్సిపల్ అధికారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని వివిధ హోటళ్లు, టిఫిన్ సెంటర్ల వద్ద దుర్గంధం కనీసం నిలబడాలే పరిస్థితి లేకుండా పోయింది. జిల్లా కేంద్రంలో సుమారు వందకు పైగా పెద్ద హోటళ్లు, టిఫిన్ సెంటర్లు ఉన్నాయి. హైదరాబాద్-రాయచూర్ మెయిన్ రోడ్డులో ఉన్న కొన్ని టిఫిన్ సెంటర్లు, హోటళ్ల ద్వారా వ్యర్థ ఆహార పదార్థాలు, కలుషిత జలాలు సమీపంలోని డ్రెయినేజీల్లో కలుస్తున్నాయి. చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారికి, అటువైపు రోడ్లపై నడిచే పాదచారులు, వాహనదారులు ఈ దుర్గంధం భరించలేకపోతున్నారు. వాస్తవానికి పట్టణంలో అన్నీ ఓపెన్ నాలాలే ఉన్నాయి. దీంతో ఆయా హోటళ్లు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు వదిలిన మురుగు ముందుకు కదలక.. ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. లక్ష్మీనగర్‌కాలనీలోని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం గల్లీలో, పద్మావతీకాలనీ ఎస్‌బీఐ బ్రాంచి సమీపంలో, లక్ష్మీనగర్-బృందావన్‌కాలనీలోకి వెళ్లే మార్గంలో, న్యూటౌన్ ప్రాంతంలోని కొన్ని హోటళ్ల నుంచి డ్రెయినేజీల్లో వ్యర్థ పదార్థాలు కలుస్తున్నాయి. కాగా, ఈ హోటళ్లలో రెండింటికి ఇటీవల స్వచ్ఛత అవార్డులు ఇవ్వడం గమనార్హం.



లక్ష్మీనగర్-బృందావన్‌కాలనీకి వెళ్లే మార్గంలోని ఓపెన్ నాలాలో పేరుకుపోయిన వ్యర్థ పదార్థాలు



సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం పక్క గల్లీలో ఇలా..

### పైపులైన్‌లో కలపడానికి వీలులేదు..

వివిధ హోటళ్లు, టిఫిన్ సెంటర్ల నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలు, కలుషిత జలాలు హైదరాబాద్ మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న పెద్ద పైపులైన్‌లో కలపడానికి వీలులేదు. నిబంధనల ప్రకారం అలా చేయడం కుదరదు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని నిర్వాహకులకు సూచిస్తాం.

– సుబ్రమణ్యం, మున్సిపల్ ఇంజినీర్, మహబూబ్‌నగర్

## ముత్యాలంపల్లిలో స్వర్ణోత్సవాలు



ప్రవచనాలు చదివి వినిపిస్తున్న పీఠాధిపతులు

భూత్పూర్: మండలంలోని పోతులమడుగు గ్రామ పంచాయతీలోని అనుబంధ గ్రామమైన ముత్యాలంపల్లిలో శుక్రవారం నుంచి స్వర్ణోత్సవాలు ప్రారంభమైనట్లు సీతారామంజనేయ ఆశ్రమ అధ్యక్షుడు వెంకట్ చరణ్ బ్రహ్మచారి అన్నారు. 30న జరిగే చండీయాగం ముగింపునకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడ పీఠాధిపతులు పరిపూర్ణానంద సరస్వతి స్వాములతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి 30 మంది పీఠాధిపతులు వస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం చండీయాగం, రుద్రహోమం ప్రారంభమయ్యాయని, శివుడికి రుద్రాభిషేకం, దంపతులతో కంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. పీఠాధిపతులు ఆచార్య గౌరయ్య, జానకిరాములు, రమానందస్వామి, తిరుపతి తీర్థానందస్వాములు భక్తులకు ప్రవచనాలు చేశారు. 29న అఖండ హనుమాన్ చాలీసా పారాయణం, గీతా పారాయణం, సద్గురు అష్టోత్తర శతనామావళి పూజ, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు పల్లకీ సేవ, ఆచార్య పరమాత్మానందగిరి స్వామివారి ప్రవచనాలు ఉంటాయని ఆశ్రమ బ్రహ్మచారి వెంకట్ చరణ్ తెలిపారు.

## రైస్‌మిల్లుల వద్ద రైతుల ఆందోళన



రైతులతో మాట్లాడుతున్న సింగిల్‌విండో సీఈఓ వెంకటయ్యగౌడ్

అడ్డాకుల: మండలంలోని గుడిబండ శివారులో ఉన్న రైస్‌మిల్లుల వద్ద శుక్రవారం రైతులు ఆందోళన చేపట్టారు. స్థానిక రైతులు మిల్లులకు తెచ్చిన ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు, మిల్లుల యాజమానులకు మధ్య వాగ్వివాదం జరిగింది. గుడిబండతో పాటు ఇతర గ్రామాలకు చెందిన రైతులు ధాన్యాన్ని మిల్లులకు తెస్తున్నారు. ఈ క్రమంలో గుడిబండ రైతులకు చెందిన జేజేఎల్ రకం ధాన్యం బాగోలేదని వాటిని తీసుకోవడానికి స్థానిక లక్ష్మీనర్సింహ రైస్‌మిల్లు, రామాంజనేయ రైస్‌మిల్లుల యాజమానులు నిరాకరించారు. అడ్డాకుల సింగిల్‌విండో ద్వారా సేకరిస్తున్న ధాన్యాన్ని స్థానిక మిల్లులకు కేటాయించారు. అయితే జేజేఎల్ రకం ధాన్యం బాగోలేదని, క్వింటాల్‌కు నాలుగు కిలోల వరకు తరుగు తీస్తామని మిల్లుల యాజమానులు చెప్పడంతో రైతులు ఆందోళనకు దిగారు. అసలే దిగుబడి రాక పెట్టిన పెట్టుబడి వస్తుందన్న నమ్మకం లేదని దిగులుగా ఉంటే మళ్లీ ఇక్కడ తరుగు తీస్తామనడం ఏమిటని ప్రశ్నించారు. సమాచారం అందుకున్న సింగిల్ విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, సీఈఓ వెంకటయ్యగౌడ్ మిల్లుల వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడారు. మిల్లుల యాజమానులతో మాట్లాడి ధాన్యం తీసుకోవాలని నచ్చజెప్పారు. ఈక్రమంలో సివిల్ సప్లయ్ అధికారులతో విండో చైర్మన్ మాట్లాడారు. ఒక దశలో రైతులు మిల్లులకు తాళం వేసే వరకు పంచాయతీ దారి తీసింది. చివరికి మిల్లుల యాజమానులు ధాన్యం తీసుకోవడానికి ఒప్పుకోవడంతో రైతులు శాంతించారు. యథావిధిగా ధాన్యం సేకరణ మొదలైంది. ఇదిలా ఉండగా, రైతులకు నష్టం కలుగకుండా ధాన్యం సేకరణ చేపడుతున్నట్లు విండో సీఈఓ వెంకటయ్యగౌడ్ తెలిపారు.

## సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి

జడ్చర్ల: గుండెపోటు సమయంలో ప్రాణాన్ని కాపాడేందుకు సీపీఆర్ చేయాలని, సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గంగాపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి శివకాంత్ తెలిపారు. శుక్రవారం పీహెచ్‌సీలో జడ్చర్ల, మిడ్జిల్ మండలాల అంగన్‌వాడీ టీచర్లకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గుండె నొప్పి కారణంగా వయసుతో సంబంధం లేకుండా ప్రాణాలను కోల్పోతున్నారని, అలాంటి సమయంలో సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని తెలిపారు.

## పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి



జడ్చర్లలో నిరసన తెలుపుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు



గండేడ్‌లో..

జడ్చర్ల: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజేషన్ చేయాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. రెగ్యులరైజ్ చేయడంతో పాటు నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలాన్నీ సర్వీసులో కలపాలన్నారు. అదేవిధంగా అవుట్ సోర్సింగ్ కార్యదర్శులను జేపీఎస్‌లుగా ప్రమోట్ చేస్తూ పనిచేసిన కాలాన్ని ప్రొబేషనరీ పీరియడ్‌లో భాగంగా పరిగణించడంతో పాటు రెగ్యులరైజ్ చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో అభిలాష్, శ్రీకాంత్‌రెడ్డి, శివప్రకాశ్, స్వాతి, సత్యమ్మ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో బుచ్చన్న, నర్మద, నర్సింహులు, శాంతిప్రియ, నరేష్, రాజేష్ తదితరులు ఉన్నారు.

మిడ్జిల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శనివారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. అనంతరం ఎంపీపీ సుదర్శన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు ఇమ్రాన్‌బారి, మధుకుమార్, సుదర్శన్, నరేష్, వెంకటేష్, లాలు, ప్రీతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గండేడ్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం విస్మరించడం సరికాదని కాంగ్రెస్ జిల్లా పంచాయత్‌రాజ్ అభియాన్ కన్వీనర్ జితేందర్‌రెడ్డి, మహమ్మదాబాద్ మండల అధ్యక్షుడు నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేపట్టారు. వీరికి ఉమ్మడి గండేడ్ మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్‌లు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పుల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మల్కయ్య, శ్రీనివాస్, ఏపీఓ హరిశ్చంద్రుడు పాల్గొన్నారు.

హన్వాడ: తమను రెగ్యులరైజ్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శాంతియుత నిరవధిక సమ్మె ప్రారంభించారు.

కోయిల్‌కొండ: పంచాయితీ కార్యదర్శులను రెగులరైజ్ చేసి సీఎం కేసీఆర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరసనకు ఆయన మద్దతు పలికారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నందకిశోర్, నరేష్, చైతన్య, సంతోష్, శ్రీనివాసులు, వెంకటేష్, శ్రీలత, అర్చన తదితరులు పాల్గొన్నారు.



హన్వాడలో..

## బీఆర్‌ఎస్‌లో చేరిక



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వైఎస్ఆర్‌టీపీకి చెందిన రవిప్రసాద్ బీఆర్‌ఎస్‌లో చేరారు. శుక్రవారం హైదరాబాద్‌లో క్యాంపు కార్యాలయంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. పార్టీలో క్రమశిక్షణతో పని చేయాలని, పదవులు అవే వస్తాయన్నారు. కార్యక్రమంలో కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉగాది పురస్కారం



స్టేషన్ మహబూబ్‌నగర్: హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత్ పరిషత్‌లో శ్రీత్రినయన సాంస్కృతిక కళా నిలయం ఆధ్వర్యంలో శోభకృత్ నామ సందర్భంగా ఉగాది నంది పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్‌కాలనీకి చెందిన గబ్బూర్ మఠం అభినయస్వామి ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు.

## నిర్లక్ష్యం చేయొద్దు

గండేడ్: గ్రామాల్లో త్వరితగతిన కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని తహసీల్దార్ జ్యోతి అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఐకేపీ సీసీలు, వీబీకేలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటికే వరికోతలు ప్రారంభమయ్యాయని, వెంటనే కేటాయించిన కేంద్రాలు ప్రారంభించేలా చూడాలని సిబ్బందిని కోరారు. వర్షాలు ఉన్న నేపథ్యంలో వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

కోయిల్‌కొండ: రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ శశికళ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇబ్రహీంనగర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణయ్య, ఎంపీడీఓ జయరాములు, ఎంపీటీసీ ఆంజనేయులు, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్లయ్య పాల్గొన్నారు.

మిడ్జిల్: మండలంలోని మల్లాపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో, కొత్తూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఎంపీపీ సుదర్శన్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్‌లు జంగారెడ్డి, రాధిక, ప్రతాప్‌రెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసులు

అడ్డాకుల: మద్యం మత్తులో వాహనాలను నడిని ప్రమాదాలకు కారకులు కావొద్దని ఎస్‌ఐ మాధవ రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులను నిలిపి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వాహనదారులతో ఎస్‌ఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ద్విచక్రవాహనదారులు తప్పకుండా తలకు హెల్మెట్ ధరించాలని సూచించారు. కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. రోడ్డు నిబంధనలను పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలని కోరారు.

**మూడు రోజుల జైలుశిక్ష..**

మద్యం తాగి బైక్‌ను నడిపిన వ్యక్తికి కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం గట్లఖానాపురానికి చెందిన నందిపేట సోమన్న డ్రైవింగ్ లైసెన్సు లేకుండా ఈనెల 13న మద్యం తాగి బైక్‌ను నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డాడు. సోమన్నను పోలీసులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని కోర్టులో హాజరుపర్చారు. దీంతో సోమన్నకు మూడు రోజుల జైలు శిక్ష, రూ.2,500ల జరిమానా న్యాయమూర్తి విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు నిందితుడిని జైలుకు తరలించినట్లు తెలిపారు.

## అభివృద్ధి పనులు వేగిరం చేయండి



పెద్ద చెరువు వద్ద ఐలాండ్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని నెక్లెస్ రోడ్డు, ఐలాండ్ సుందరీకరణ, సస్పెన్షన్ బ్రిడ్జి పనులకు మే మొదటి వారంలో రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయనున్నారని కలెక్టర్ జి.రవినాయక్ తెలిపారు. అలాగే మినీ శిల్పారామం ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. శుక్రవారం ఆయా పనులను ఆయన ఇంజినీరింగ్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐలాండ్‌పై శిలాఫలకం వేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌లతో పాటు గజగోలు తదితర పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే కొత్తగా ట్యాంక్‌బండ్ నుంచి రామయ్యబౌలి వరకు ఏర్పాటు చేసిన బ్రిడ్జిపై ఎలాంటి అడ్డంకులు లేకుండా శుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కె.సీతారామారావు, ఇరిగేషన్ ఎస్ఈ చక్రధరం తదితరులు పాల్గొన్నారు.

## ఆటపాటలతో విద్యనందించాలి



చిన్నారులను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మహబూబ్‌నగర్ రూరల్: చిన్నారులకు ఆటపాటలతో అంగన్‌వాడీ టీచర్లు విద్యను అందించాలని ఎంపీపీ సుధాశ్రీ, జెడ్పీటీసీ సభ్యురాలు పి.వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ కె.అనిత అన్నారు. శుక్రవారం మండలంలోని కోటకదిర, అప్పాయిపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు అసెస్‌మెంట్ కార్డులను అందజేశారు. ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ఉత్తమ విద్యార్థి అవార్డులను అందజేశారు. కోటకదిరలో సర్పంచ్ మల్లు రమ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. 6ఏళ్లలోపు పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ఎల్.శాంతిరేఖ, సూపర్‌వైజర్ సరితరాణి, పంచాయతీ కార్యదర్శి మాధవి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అసోసియేషన్ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: మంచిర్యాలలో శని, ఆదివారాల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలకు జిల్లా స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా అధ్యక్షుడు కె.రవికుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలకు వెళ్తున్న విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26మంది విద్యార్థులు మ్యూజికల్ ఫాం, పాయింట్‌ఫైట్, టీమ్ ఈవెంట్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి, సంస్కార్ స్కూల్ ప్రిన్సిపాల్ వినోద్, జిల్లా స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవినాయక్ పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



జిల్లా కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

మహబూబ్‌నగర్ క్రైం: దొంగతనాలు నివారించడానికి ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న కొత్త చెరువు రోడ్‌లో ఉన్న సురేందర్ కాలనీలో శుక్రవారం రాత్రి కమ్యూనిటీ కనెక్ట్ అనే కార్యక్రమంలో భాగంగా ఇళ్లను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది ఆ కాలనీలో ఉన్న ఇళ్లలో ఉండే వారి ఆధార్‌కార్డులతో పాటు ఇతర గుర్తింపు కార్డులు పరిశీలించారు. ఈ తనిఖీల్లో నంబర్ ప్లేట్స్ లేకుండా ఉన్న పది ద్విచక్ర వాహనాలను గుర్తించారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న వల్లభ్‌నగర్‌లో శుక్రవారం రాత్రి కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా తనిఖీలు నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ డి.స్వామిగౌడ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. మొత్తం 102ఇళ్లు తనిఖీ చేసి దాంట్లో నివాసం ఉండే 214మంది గుర్తింపు కార్డులను పరిశీలించారు. నంబర్ ప్లేట్స్ లేకుండా ఉన్న 12వాహనాలు గుర్తించారు.

**జౌకీనగర్‌లో పోలీసుల తనిఖీలు..**

జడ్చర్ల: పట్టణంలోని జౌకీనగర్‌లో శుక్రవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. కమ్యూనిటీ ప్రోగ్రాంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలను తనిఖీ చేశారు. ఆధార్‌కార్డులను పరిశీలించి వివరాలు సేకరించారు. గుర్తు తెలియని వ్యక్తులకు అద్దెకు ఇళ్లు ఇవ్వరాదని, వివరాలు తెలుసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులపై తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. సరైన ధ్రువపత్రాలు లేని మూడు కార్లు, 13 బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, లెనిన్, సిబ్బంది పాల్గొన్నారు.

## కౌకుంట్లలో భక్తిశ్రద్ధలతో బోనాలు



బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు, గ్రామస్తులు

దేవరకద్ర రూరల్: కౌకుంట్ల మండల కేంద్రంలో బోనాల పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతల ప్రతిష్ఠాపన చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా గ్రామంలో మూడు రోజుల పాటు వేదపండితుల ఆధ్వర్యంలో హోమాలు, వివిధ పూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

జడ్చర్ల: అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక కేంద్రం అధికారి మల్లిఖార్జున్ తెలిపారు. శుక్రవారం స్థానిక కావేరమ్మపేటలో అగ్నిప్రమాదాలు సంభవించిన సందర్భాల్లో నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. విద్యుదాఘాతంతో ఏర్పడే ప్రమాదాల నివారణకు తీసుకునే చర్యలను వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేశ్, కౌన్సిలర్ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.